బాసర ఇన్‌చార్జి వీసీని తొలగించండి

ఉస్మానియా యూనివర్సిటీ: బాసర ట్రిపుల్ ఐటీ ఇంచార్జి వీసీ ప్రొ.వెంకట రమణను పదవి నుంచి తొలగించాలని ఓయూ జేఏసీ అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్ ఆదివారం డిమాండ్ చేశారు. తన అసమర్థ పాలన కారణంగా 12 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా గత రెండేళ్లలో అవినీతి, అక్రమాలు పెరిగినట్లు తెలిపారు. పర్మనెంట్ వీసీని నియమించాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

టీపీసీసీ అధ్యక్షుడికి నేతల సత్కారం



అమీర్‌పేట: టీపీసీసీ అధ్యక్షులుగా నియమితులైన మహేష్ కుమార్‌గౌడ్‌ను సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సన్మానించారు. ముద్దాపురం శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం మహేష్‌గౌడ్ నివాసంలో కలిసి అభినందలు తెలిపారు.

త్రీస్టార్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అన్నదానం



త్రీస్టార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులను సన్మానిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: మూడు రోజుపాటు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించిన సీతాఫల్‌మండి త్రీస్టార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కార్పోరేటర్ సామల హేమ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నాలుగు దశాబ్దాలుగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులను ఆమె సన్మానించారు. ఈ కార్యక్రమంలో త్రీస్టార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు భొగ్గుల కృష్ణ, చెన్నయ్యగౌడ్, భాస్కర్‌రావు, సాయినాథ్, జీవీ కృష్ణ, అశ్విన్‌కుమార్, కరాటే రాజు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

చిలకలగూడ : గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న ఘటన సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణంలో జరిగింది. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, ఎస్‌ఐ కిషోర్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీఆస్పత్రి ప్రాంగణంలోని వెయిటింగ్ హాలు, అవుట్‌పేషెంట్ విభాగ సమీపంలో ఇరువురు వ్యక్తులు అపస్మారక స్థితిలో పడున్నట్లు సెక్యూరిటీ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారణ అయింది. ఇరువురు పురుషుల మృతదేహాలను మార్చురీలో భద్రపరిచామని, మృతుల బంధువులు, కుటుంబసభ్యులు చిలకలగూడ పోలీసులను (040–27853597, 8712661252)సంప్రదించవచ్చన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఆదివారం ఉదయం గౌతమీ ఎక్స్‌ప్రెస్ రైలు మౌలాలి– లాలాగూడ రైల్వేస్టేషన్ల మధ్యకు చేరుకుంటున్న సమయంలో ఒక వ్యక్తి అదే రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు లోకో పైలెట్ ద్వారా సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులకు మృతుడి వివరాలు లభించలేదు. మృతుడి ఒంటిపై నీలిరంగు చొక్కా, నలుపురంగు ప్యాంటు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య



రసూల్‌పురా: చెడు వ్యసనాలకు అలవాటు పడ్డ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కార్ఖాన పీఎస్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన మేరకు.. పీఎస్ పరిధిలోని రైల్వే ఎన్‌క్లేవ్ ఫ్లాట్ నంబర్ 24లో నివాసం ఉండే ఆర్కిటెక్ట్ జనార్థన్ బాలాజీ కుమారుడు రిషిత్ (18) నాచారం డీపీఎస్‌లో ఇంటర్ పూర్తి చేశాడు. తల్లిదండ్రులు మారేడుపల్లి లోని బంధువుల ఇంటికి ఉదయం వెళ్ళి 11 గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చారు. మొదటి అంతస్తులో చెక్క ఊయల హుక్కుకు దుప్పటితో ఉరివేసుకుని ఉండడం గమనించారు. వాల్‌మెన్ కనకయ్యను ఫోన్ చేసి అతని సహాయంతో కిందకు దించారు. అప్పటికే మృతి చెందినట్లు గమనించి పోలీసులుకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు.



సనత్‌నగర్‌లో కొలువుదీరిన గణనాథుడి సేవలో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి



రవీంద్రనగర్ కాలనీ అసోసియేషన్ గణనాథుడి పూజలో అధ్యక్షుడు విజయ్‌సింగ్ తదితరులు



విఘ్నేశ్వరుడి మండపంలో పూజలో పాల్గొన్న బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి



తార్నాక గోఖుల్‌నగర్‌లో మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి

జై బోలో.. గణేష్ మహరాజ్‌కీ..



గోధుమపిండితో తయారుచేసిన బుజ్జి గణపయ్య

ఎటుచూసినా పార్వతీ తనయుడి నామస్మరణే...దిక్కులు పిక్కటిల్లేలా జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ భక్తజనం జయజయ ధ్వానాలు పలుకుతుండగా... విద్యుత్‌కాంతుల నడుమ ధగ ధగ మెరిసిపోతోన్న మండపాల్లో గణనాథుడు కొలువుదీరాడు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రథమ పూజాధీశుడికి ఘన స్వాగతం పలికారు. వాడవాడలా...వీధి వీధినా గణేష్ ఉత్సవ శోభ సంతరించుకుంది. సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గంలోని గల్లీ గల్లీలో దర్శనమిస్తోన్న లంబోదరుడి సేవలో పునీతులవుతూ భక్తులు ఆధ్యాత్మిక జగత్తులో మునిగితేలుతున్నారు. గౌరీసుతుడిని స్తుతిస్తూ సాగిన సంగీత గానామృతంతో తడిసిముద్దయ్యారు. కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్ల అసోసియేషన్లు ప్రత్యేకంగా మండపాలను అలంకరించి బొజ్జ గణపయ్యకు విశేష పూజలు నిర్వహించారు. విభిన్న రూపాల్లో గణేషుడు మండపాల్లో దర్శనమిస్తున్నాడు.

సనత్‌నగర్



మోడల్‌కాలనీలో ప్రవచనం చేస్తున్న బ్రహ్మశ్రీ మైలవరపు శ్రీనివాసరావు



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలోని గణపతి దేవాలయంలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్



రసూల్‌పురా ఇందిరమ్మనగర్‌లో..



తార్నాక లేబర్ అడ్డా వద్ద బిజెపి జిల్లా కార్యదర్శి వీరన్న



మెట్టుగూడలో బీజేపీ మహంకాళి ప్రధాన కార్యర్శి మేకల సారంగపాణి



సనత్ నగర్ లింగయ్య నగర్ లో కొలువుదీరిన వినాయకుడి పూజలో వెల్లల రామ్మోహన్



శ్రీనివాసనగర్‌లో గణనాథుని పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ గణేషుడు..



ఓయూ ఇంజనీరింగ్ హాస్టల్‌లో...



మెట్టుగూడ సీతారామ భజన మందిర్ వద్ద..

మహాగణపతిని దర్శించుకున్న కోట నీలిమ

సనత్‌నగర్: ఖైరతాబాద్ గణనాథుడిని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ దర్శించుకున్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, ఆయురోగ్యాలను ప్రసాదించాలని గణనాథుణ్ణి వేడుకున్నట్లు చెప్పారు. ఆమె వెంట సీనియర్ నాయకులు విశాల్ సూదం తదితరులు ఉన్నారు.

ఏకదంతుడికి ప్రత్యేక పూజలు

వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన పలు మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు వినాయక మండపాల వద్ద జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రసూల్‌పురా: వినాయకచవితి పండగను పురస్కరించుకుని కంటోన్మెంట్‌లోని వివిధ బస్తీల్లో కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. రసూల్‌పురా, పోలీస్‌లైన్ తాడ్‌బండ్‌లో ప్రతిష్ఠించిన గణేష్ మండపంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

- కార్ఖానలోని గణేష్ టెంపుల్‌లో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ప్రత్యేకపూజలు చేశారు.
- సిక్‌విలేజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విఘ్నేశ్వరుడు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాడు.



సిక్‌విలేజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ప్రవచనాలు

సనత్‌నగర్: సనత్‌నగర్, అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్, మోండా డివిజన్లలో గణేష్ చతుర్థి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మోడల్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో తొలి రోజు బ్రహ్మశ్రీ మైలవరపు శ్రీనివాసరావు ప్రవచన కార్యక్రమం జరిగింది. 'నిత్య జీవితానికి గీతా సారాంశం' అనే అంశంపై సాగిన ప్రవచనం ఆలోచింపజేసింది. భగవద్గీత మనిషి ఎలా ఉండాలో తెలియజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్ రావు, ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు, ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి, కోశాధికారి శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌పేట: సనత్‌నగర్ డివిజన్ కైలాష్‌నగర్ వినాయక మండపంలో సుభాష్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బోగి బాల్‌రాజ్ సభ్యులతో కలిసి పూజలు చేశారు. మండపం ఆవరణ మొత్తం పచ్చని వాతావరణం కనిపించేలా ఏర్పాటు చేసిన గ్రీనరీ, మొక్కలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో..

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలోని గణపతి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తోపాటు నాయకులు సంకి రవీందర్, బల్వంత్‌రెడ్డి, బద్రినాథ్ యాదవ్, ముప్పిడి మధుకర్, సంతోష్‌యాదవ్, నందికంటి రవి, తేజ్‌పాల్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈవో వినోద్‌రెడ్డి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టారు.

మాజీ మేయర్ ప్రత్యేక పూజలు

లాలాపేటలో.. తార్నాక, లాలాపేట, శాంతి నగర్, మాణికేశ్వర్‌నగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో వాడ వాడలా గణనాథులను ప్రతిష్ఠించారు. తార్నాక గోకుల్‌నగర్‌లో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన భారీ గణనాథునికి మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బిజేపి రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు రజక శ్రీనివాస్, లడ్డు, సత్యం,రాజు, సురేష్, గోఖుల్ నగర్ వాసులు పాల్గొన్నారు.

- తార్నాక లేబర్ అడ్డావద్ద కొలువైన వినాయకుని పూజలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎం. వీరన్న, లేబర్ అడ్డా నాయకులు ఆటో మల్లయ్య,పెయింటర్ రాజు,వెంకన్న, కనకరాజు,నరేష్, శ్రీను,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఏబీవీపీ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని నాలుగు లేడీస్ హాస్టల్స్‌తో పాటు బాలుర వసతి గృహాలలో 23 ఏకదంతుని విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ హాస్టల్ లో ఏర్పాటు చేసి గణేష్ విగ్రహానికి ఏబీవీపీ రాష్ట్ర నాయకులు తోట శ్రీనివాస్, ఆల్ వర్సిటీల కన్వీనర్ జీవన్, రాజు, పృథ్వీ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేయండి



టీపీసీసీ అధ్యక్షునికి వినతి పత్రం అందచేస్తున్న తెలంగాణ మాల మహానాడు నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ పార్టీ గతంలో ప్రకటించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేయాలని తెలంగాణ మాల మహానాడు నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది తల్లమల్ల హస్సేన్ ఆధ్వర్యంలో నూతన టీపీసీసీ అధ్యక్షులుగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి అభినందనలు తెలిపి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించిన చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకారం రిజర్వేషన్లను పెంచాలన్నారు. అంబేడ్కర్ అభయ హస్తం పథకం అమలు చేసి దళితులకు రూ.15 ఆర్థిక సహాయం అందచేయాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి మంచాల వెంకటస్వామి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి సన్మానం

లాలాపేట: నూతన పీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఆదివారం తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం నాయకులు ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఇంతటి అవకాశం కల్పించడంపై కాంగ్రెస్ అధిష్ఠానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘం అధ్యక్షులు డా. కొమ్ము అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

